01ATP17F_01ATP17F.qxd 17-10-2025 PM 10:50 Page 1





అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 18 అక్టోబర్ 2025 పేజీలు : 04

# దక్షిణ భారతదేశంలో 47 వేల కోట్లతో 3,800 కి.మీ పనులు...

- 2027 మార్చిలోగా తమకూరు రాయదుర్గం రైల్వే లైన్ పూర్తి
- తుమకూరు - దావణగెరె మధ్య రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు
- కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న వెల్లడి.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర రైల్వేశాఖమంత్రి సోమన్న,ఎంపి, ఎమ్మెల్యే ,మాజీ ఎమ్మెల్సీ , రైల్వే పనులను పరిశీలిస్తున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న,ఎంపి పార్థసారధి, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

**మడకశిర టౌన్,అక్టోబర్ 17 ప్రభాతవార్త.**

దక్షిణభారతదేశంలో 47వేల కోట్లతో 3,800 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు జరుగుతున్నాయని, ప్రధాని నరేంద్ర మోడీ రైల్వే లైన్ల నిర్మాణం కు ప్రాధాన్యత ఇస్తున్నారని రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న తెలిపారు. మడకశిర ప్రాంతంలో జరుగుతున్న తుంకూర్ రాయదుర్గం రైల్వే లైన్ నిర్మాణపనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానికఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు,క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామిలతోపాటు కేంద్రరైల్వేశాఖ మంత్రిసోమన్న మాట్లాడుతూ :రాయదుర్గం, తమకూరు రైల్వేలైన్ పనులను 2027లోగా పూర్తి చేస్తామని కేంద్రరైల్వేశాఖసహాయమంత్రి సోమన్న వెల్లడించారు. ఒకటిన్నరేళ్ళలో ఈ రైల్వే లైన్ లో ప్రయాణీకులకు రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఈ రైల్వే లైన్ పరిధిలో 14 రైల్వే స్టేషన్లో వస్తాయని అందులో మడకశిర ప్రాంతంలో కొత్తలం మడకశిర ప్రాంతాల్లో రెండు రైల్వేస్టేషన్లో వస్తాయని పేర్కొన్నారు.. ప్రతి ఈరైల్వే లైన్ పూర్తి అయిన వెంటనే తమకూరు - దావణగెరె రైల్వే లైన్ పనులను ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈ రైల్వే లైనుకు సంబంధించిన సర్వే, భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. ఈ రైల్వే లైన్ ఏర్పాటుతో శిర, హిరి యూర్ కు కూడా రైల్వే సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తుంకూర్ దావనగిరి రైల్వే నిర్మాణం 192 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. ఈ రైల్వే లైన్ కూడా 2027 జూన్ జూలై నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తన హయాంలో రూ.47 వేల కోట్లతో 31ప్రాజెక్టుల ద్వారా 3,800 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో 1600 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. తమకూరు బెంగళూరు, బెంగళూరు తమిళనాడు మధ్య ఉన్న రైల్వే లైన్లను విద్యుదీకరణ చేయడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో 13,200 కిలోమీటర్లు రెండు లైన్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని ఆయన పేర్కొన్నారు. హిందూపురంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆగే విధంగా ఆదేశాలు జారీ చేశామని కూడా ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. రైల్వే రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించేటప్పుడు మంత్రితోపాటు హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, క్లాస్ 1 కాంట్రాక్టర్ జయప్ప, మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ ,మున్సిపల్ చైర్మన్ నరసింహా రాజు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, కౌన్సిలర్లు,ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గుప్త నిధులకోసం దేవాలయ తాళాన్ని పగలగొట్టి

# గణపతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన దుండగులు

- నాలుగు అడుగులు 400 కెజిల గణపతి విగ్రహాన్ని పెకలించి ఎత్తుకెళ్లారు
- గణపతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లడంతో గ్రామస్తుల ఆవేదన
- రంగంలోకి పోలీసుల క్లూస్ టీం
- శంకరేశ్వర స్వామి గుడిలో గుప్త నిధులకోసం గతంలోనే తవ్వకాలు
- ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు
- 15 ఏళ్ల క్రితం ఒక గణపతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు



ఈ గణపతి విగ్రహాన్నే దుండగులు ఎత్తుకెళ్లింది



ఈ గుడిలోనే తాళం పగలగొట్టి గణపతి విగ్రహాన్ని దోచుకెళ్లింది



పరిశీలిస్తున్న పోలీసులు

**అగళి, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

అగళి చెరువు కట్ట కింద ఉన్న శంకరేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న గుడిలోని శిలా విగ్రహాన్ని గుప్త నిధుల కోసం దుండగులు (గుప్తనిధి దారులు) ఎత్తుకెళ్లారు. గురువారం అర్ధరాత్రి చేసినట్లు పోలీసులు తెలిపారు. గుప్త నిధి దారులు దేవాలయం తాళాలు పగలగొట్టి మూడు చక్రాల వాహనం లేదా టాటా సుమోలో ఈ గణపతి విగ్రహాన్ని తీసుకెళ్లినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విగ్రహం నలుగు అడుగులు, 400 కెజిలు బరువు ఉంటుంది. ఈ విగ్రహాన్ని ఎత్తుకెళ్లడంలో స్థానికుల సహకారం ఉన్నట్లు మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత 25 ఏళ్ల క్రితం ఇదే శంకరేశ్వరస్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తుండగా పాము కనపడటంతో గుప్త నిధుల తవ్వకం దారులు పలాయనం చిత్తగించినట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. గత పదేళ్లలో అదే శంకరేశ్వరస్వామి దేవాలయం లో గుప్తనిధుల తవ్వకాలు రెండుసార్లు ప్రయత్నం చేసి విఫలమైనట్లు చెబుతున్నారు. ఒకసారి గుప్త నిధుల తవ్వకందారుల తవ్వకాలకు వాడే ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. మరోసారి మహిళ ఎస్ఐ ఉన్నప్పుడు గుప్త నిధుల తవ్వకం దారులపై మరో కేసు నమోదైంది. గత 25 ఏళ్లు-30 ఏళ్ల క్రితం అప్పట్లో ముగ్గురు పోలీసులు, స్థానికుల సహకారంతో తవ్వకాలకు ప్రయత్నించగా పాము కనపడటంతో తెచ్చిన ఆయుధాలను వదిలిపెట్టే పారిపోయారు. అయినా శంకరేశ్వర స్వామి కన్నెర్ర చేయడంతో పోలీసులు వివిధ రోగాల భారిన పడి మరణించారని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. బ్లడ్ క్యాన్సర్ ఒకరికి, తిక్కపట్టడం వంటి వాటితో మృత్యువాత పడినట్లు తెలియజేస్తున ఆనరు. స్థానికంగా సహకరించిన వారి కుటుంబాల్లో సైతం ఇటువంటి పరిస్థితులే ఎదురైనట్లు తెలియజేస్తున్నారు. అయితే శంకరేశ్వర స్వామి దేవాలయం, చుట్టుపక్కల ఉన్న గణపతి దేవాలయాల విశిష్టతను ప్రజలు, భక్తాదులు చర్చించుకుంటుండటంతోనే హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి నగరాలలోని గుప్త నిధుల తవ్వకం దారుల కన్ను పడి గుప్త నిధుల కోసం ఇటువంటి చర్యలకు పాల్పడుతుండవచ్చని ప్రజలు చర్చించుకోవడం కనిపిస్తోంది. అంత పెద్ద గణపతి విగ్రహాన్ని మిగతా 4 లో...

# గ్రామాభివృద్ధి లో కార్యదర్శులే కీలకం- ఎమ్మెల్యే

**పుట్టపర్తి టౌన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులే ఎంతో కీలకం అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం పదోన్నతి కల్పించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో గ్రామ కార్యదర్శులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. సమస్యల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలతో బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ప్రతి పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే విధంగా కార్యదర్శులు పని చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం నిత్యం ప్రజల మధ్యన పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామాల్లో వీధిలైట్లు, పారిశుధ్యం, త్రాగునీరు, అభివృద్ధి పనుల పై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలను అందంగా తీర్చిదిద్దే విధంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ లేకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిపిఓ సమత మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర సంస్థలతో సంబంధం ఉంటే కఠిన చర్యలు

- రాడికల్ భావాలను ప్రోత్సహిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి
- జైష్ ఏ మొహమ్మద్ ఉగ్రవాదుల అరెస్ట్ - జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి, అక్టోబర్ 17, ప్రభాతవార్త**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, పాకిస్తాన్ఐ ఎస్ ఐ ఆధారిత జైష్ఎమొహమ్మద్ కు చెందిన పలువురు వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యుడిగా ఉన్న ఉత్తర్ ప్రదేశ్ నివాసి సాజాద్ హుస్సైన్ మరియు మహారాష్ట్ర నివాసి తౌఫీక్అల్ శ్రీకం లను జిల్లా పోలీసులు అరెస్టు చేయడం జరిగిందన్నారు. గతంలో ధర్మవరం పట్టణానికి చెందిన కోత్వాల్ నూర్ మొహమ్మద్ (42) పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ ఆధారిత జైష్ఎమొహమ్మద్ (జే ఈ ఎం) కు చెందిన పలువురు వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యుడిగా ఉంటూ, భారతీయ భూభాగం లో రాడికల్/జిహాది కార్యకలాపాలలో పని చేస్తుండడం తో అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పాకిస్తాన్‌లోని జిహాది కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండి భారతదేశం వ్యతిరేక చర్యలు చేపట్టే యత్నాలు చేస్తారని గుర్తించడం జరిగిందన్నారు. మరింత దర్యాప్తులో, ఇంటెలిజెన్స్ సమాచారంపై ఆధారపడి, మరొక ఇద్దరు జిహాది సభ్యులను గుర్తించామని, ఉత్తర్ ప్రదేశ్ నుండి సాజాద్ హుస్సైన్ మరియు మహారాష్ట్ర నుండి తౌఫీక్ అలామ్ షేక్ లను 13.10.2025 న, ఏపీ పోలీస్ బృందాలు అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఉత్తర్ ప్రదేశ్ పోలీస్‌ల సహకారంతో అమ్రోహా లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సాజాద్ హుస్సైన్ (ఎ 2) ను అరెస్టు చేశారన్నారు. అతను జమా మదరాసలో అలిం కోర్సు చేస్తున్నాడని , అతని వద్ద నుండి ఎలెక్ట్రానిక్ గాడ్జెట్స్ మరియు జిహాది మెటీరియల్ స్వాధీనము చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా జంపర్వా లోని సజాద్ హుస్సైన్ నివాసం ఉంటున్న ఇంటి నుండి ఒక సింగిల్ బారెల్ రైఫిల్ కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇది అతని బంధువుది అని, సదరు ఆయుధంను జిహాదీ కార్యాక్రమాలను ఉపయోగించేవారని తెలిసిందన్నారు. అదే రోజు (13.10.2025) ఏపీ పోలీస్ మరియు మహారాష్ట్ర ఏటిఎస్ బృందాలు రైడ్‌లు నిర్వహించి తౌఫీక్ ఆలమ్ షేక్ (ఎ 3) ను నాసిక్, మలేగావుల్లో అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టు సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలు మరియు జిహాది మెటీరియల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఉన్న జైష్ఎ ఆధారిత వాట్సాప్ గ్రూప్‌లు, చానల్స్‌లలో క్రియాశీలక సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. వీరు జే ఈ ఎం ఆపరేటర్లతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి తల్హా భాయ్ (మోలానా మసూద్ అజార్ సోదరుడుచీఫ్ ఆఫ్ జే ఈ ఎం అండ్ అదర్స్), యువతను జిహాది కోసం రాడికలైజ్ చేస్తూ, వారు పాకిస్తాన్‌లో మిలటరీ శిక్షణ తీసుకొని భారతదేశం పై యుద్ధం చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానాల్లో హాజరు పరచిన అనంతరము ట్రాన్సిట్ వారంట్లపై వారిని ధర్మవరంకు తీసుకురావడం జరిగిందన్నారు. త్వరలో సంబంధిత న్యాయస్థానాల్లో మిగతా 4 లో...

# మార్చి చివరి నాటికి 2300 టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇస్తాం

## అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ




టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, అధికారులు

**అనంతపురం, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

వచ్చే మార్చి చివరి నాటికి అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 2300 టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగర శివారులోని చిన్మయనగర్‌లో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మునిసిపల్, టిడ్కో, హౌసింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇళ్లను పరిశీలించారు. అధికారులు వీటిపై సరైన సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చెప్పిన పనులు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు. దీనిపై ఎందుకు నాకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఇప్పుడు జరిగేందుకు అవకాశం లేదని.. అలా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. 2019 నుంచి 24 వరకు టిడ్కో ఇళ్లను పూర్తిస్థాయిలో నాశనం చేశారని, ఎంతవరకు ఇళ్ల నిర్మాణం జరిగిందో అక్కడే మొత్తం ఆగిపోయాయన్నారు. కనీసం ఒక డ్రైన్ వేయలేదని, ఒక కిటికీ కూడా కొత్తగా తగిలించలేదన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మొత్తం 48 బ్లాక్ లతో ఇళ్ల నిర్మాణం చేపట్టామని.. ఇందులో 27 బ్లాక్ లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగిందన్నారు. ఐదేళ్లపాటు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, ప్రైవేటు రుణాలు కట్టలేక ఇబ్బందులు పడ్డారన్నారు. వారికి ఇళ్లు దక్కకపోగా.. అప్పుల పాలైన పరిస్థితి ఉందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలు పునః ప్రారంభమయ్యాయన్నారు. మొత్తం రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి 5 వేల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందన్నారు. అర్బన్ నియోజకవర్గంలో 5100 ఇళ్ల నిర్మాణం చేపట్టామని.. ఇందులో 2300 ఇళ్లను మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు. 1680 ఇప్పటికే పూర్తయ్యాయని.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఇందు కోసం 68 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని... ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. గతంలోలాగా తాము పేర్లు, స్కీంలు మార్చే పరిస్థితి ఉండదని... ప్రజలకు మంచి జరిగే కార్యక్రమాలన్నీ కొనసాగుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మున్సిపల్ సూపరింటెంట్ ఇంజనీర్ రాజశేఖర్, ఏపీ టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధారాణి, ఇంజనీర్లు శేఖర్, అవినాష్, భారతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, జయరాం నాయుడు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహితం కోసం ఉపయోగపడేలా జర్నలిస్టులు వార్తలు రాయాలి

## ప్రశ్నిస్తూ ప్రశ్నించే తత్వాన్ని కొనసాగించాలి - సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ విజ్ఞప్తి






సమావేశంలో ప్రసంగిస్తున్న జర్నలిస్టు సీనియర్ నాయకులు,

**రాయదుర్గం, అక్టోబర్ 17, ప్రభాతవార్త**



హాజరైన వివిధ మండలాల జర్నలిస్టులు

ప్రజా హితం కోసం ఉపయోగపడేలా జర్నలిస్టులు వార్తలు రాయాలి అని, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించేందుకు ఎప్పుడు జర్నలిస్టులు ప్రశ్నించే తత్వాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం లో రెండురోజుల పునశ్చరణ తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత, నేర్చుకోవా లన్న తపన, నిత్య విద్యార్థిగా విలేఖరులకు వుండాలని సూచించారు . జర్నలిజం వృత్తి లో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పు డు పరిష్కరిస్తూ ముందుకు సాగేందుకు ఎంతో నిబద్ధత కలిగివుండాలని ఆయన సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాత్రికేయ వృత్తిలో రాణిం చాలని కోరారు. రెండు రోజుల మిగతా 4 లో...

# అక్రమంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవు

**చట్టం సూచించిన నిబంధనలు, జాగ్రత్తలు బాణసంచా విక్రేతలు పాటించాల్సిందే**

**దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు బాణసంచా కాల్చాలి**

**అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 17 ప్రభాతవార్త**



జిల్లా ఎస్పీ పి జగదీష్

జిల్లాలో నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే అమ్మాలని... మిగితా ఎవరు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి పురస్కరించుకుని జిల్లాలో టపాసుల అక్రమ విక్రయాలు జరుగకుండా ఉండేందుకు లైసెన్స్ కల్గిన దుకాణదారులు పాటించాల్సిన నియమ నిబంధనలు ప్రజలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై ఆయన శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆయన మాటల్లోనే శాశ్వత , తాత్కాలిక లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా అమ్మాలి. తాత్కాలిక లైసెన్సుదారులు ప్రభుత్వ యంత్రాంగం సూచించిన బహిరంగ ప్రదేశాలలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. నియమ నిబంధనలు పక్కాగా పాటించాలి. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలి. ఆ పరిసరాల్లో ఏమి చేయాలో ఏమి చేయకూడదో తగు సూచనలు చేస్తూ బోర్డులను ప్రదర్శనలో ఉంచాలి. 18 సంవత్సరాలలోపు పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదు. దీపావళి పర్వదినం జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలి. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలి. ఇళ్లలోపల కాకుండా బయట ఖాళీ ప్రదేశాల్లో బాణసంచా కాల్చాలి. తారాజువ్వల్లాంటి టపాసులను గడ్డి వాములు, గుడిసెలు, పెట్రోలు బంకులు వద్ద కాల్చరాదు. విద్యుత్ తీగలు, చెట్లు కింద కాలిస్తే ప్రమాదం జరిగే వీలుంది. బాణసంచా కాల్చేటప్పుడు సింథటిక్ దుస్తులు కాకుండా తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. సరదా కోసం చేతులతో పట్టుకుని టపాసులు కాల్చరాదు. బాణసంచాను దీపాలు, లాంతర్లు దగ్గర ఉంచరాదు. వంట గది కిటికీలు మూసేయాలి. అగ్గిపెట్టె, లైటర్ల దగ్గర టపాసులు ఉంచరాదు. పొడగాటి అగరబత్తులు, కొవ్వొత్తుల ద్వారానే కాల్చాలి. రెండు బకెట్ల నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి. సగం కాలిన, ఆరిపోయిన టపాసులను తిరిగి కాల్చే ప్రయత్నం చేయరాదు. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 100/112 లేదా సబంధిత పోలీసు స్టేషన్ కు సమాచారం చేరవేయాలి. బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వలపై సమాచారాన్ని చేరవేసిన వెంటనే తగు చర్యలు తీసుకోవడంతో పాటు సమాచారం చేరవేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ప్రజాహితం కోసం కలాన్ని ఉపయోగించండి

### ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్



మాట్లాడుతున్న ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

రాయదుర్గం అక్టోబర్ 17 ప్రభాతవార్త

ప్రజాహితం కోసం కలాన్ని ఉపయోగించుకోవా లని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు రాయదుర్గం పట్టణ తృప్తి గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో జర్నలిస్టులకు శిక్షణ తరగతులను ఏపి మీడియా అకాడమీ ఛైర్మన్ ప్రారంభిచ్చారు ఏపియూడబ్లూజె రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు జిల్లా యూనియన్ నాయకులు ప్రారంభ సభలో పాల్గొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టు మిత్రులు నైపుణ్యం పెంచుకోవాలని ఛైర్మన్ సూచించారు. వృత్తి పట్ల నిబద్ధతతో కలిగి ప్రజాహితం కోసం కలాన్ని, కెమెరాలను ఉపయోగించాలని సూచించారు. జర్నలిస్టు మిత్రులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్లూజె జిల్లాఅధ్య? ప్రధాన కార్యదర్శులు పయ్యావుల ప్రవీణ్, షేక్ మహమ్మద్ ఆయూఫ్, గౌరవాధ్యక్షులు భోగేశ్వర్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు, స్థానిక యూనియన్ నేతలు కమలాక్షుడు, గురురాఘవేంద్ర, సీనియర్ పాత్రికేయులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విలేకరులు పాల్గొన్నారు.

## సీపీఆర్ గురించి కే జి.బి.వి విద్యార్థులకు అవగాహన



సిపిఆర్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం అక్టోబర్ 17 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అఫ్తాబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో సిపిఆర్ మీద విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్ మాట్లాడుతూ సిపిఆర్ అంటే కార్డియోపల్మోనరీ రిససిటేషన్ అని, ఎవరైనా వ్యక్తికి అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు లేదా మెదడుకు మరియు ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తాన్ని ప్రసరింపజేయడానికి ఇది ఒక ప్రాణాన్ని రక్షించడంలో సహాయపడుతుందని, కార్డియాక్ అరెస్టు సంభవించినప్పుడు అనగా గుండె పంపు చేయడం ఆపివేసినప్పుడు ప్రథమ చికిత్సగా కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) అప్పటికప్పుడు అన్వయించకపోతే బ్రతికే అవకాశాలు చాలా తక్కువ అని చెబుతూ సిపిఆర్ ఎలా చేయాలో ప్రదర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అయితే గుండెపోటు వచ్చి గుండె ఆగిన సందర్భాల్లో లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉన్ననప్పుడు మాత్రమే ఆ వ్యక్తి ఛాతీ మధ్యలో ఒక చేతిని ఉంచి మరొక చేతిని పైన ఉంచాక వేళ్లను ఇంటర్‌లాక్ చేసి నిమిషానికి 100 సార్లు చొప్పున 120 అంగుళాల ఛాతీలోపలికి లక్ష్యంగా చేసుకుని గట్టిగా మరియు వేగంగా క్రిందికి నొక్కితే వెంటనే ఆ చర్యల పునరుద్ధరణకు సీపీఆర్ అనే ప్రథమచికిత్స చేసి రోగి ప్రాణాలు ఖచ్చితంగా కాపాడవచ్చని తెలిపారు. సిపిఆర్ చేశాక వెంటనే సమీపంలో ఉన్న పెద్ద ఆసుపత్రికి తీసుకొని వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రామలక్ష్మి, ఫార్మసిస్ట్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్ కుమార్, ఆశా కార్యకర్తలు రామలక్ష్మి , ప్రేమక్క పాల్గొన్నారు.

## సబ్సిడీతో సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ని పొందండి : ఏ ఈ శంకర్ నాయక్

కనేకల్లు అక్టోబర్ 17 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఏ.ఈ. శంకర్ నాయక్

సోలార్ విద్యుత్ ప్యానల్సుకు జీఎస్టీ తగ్గడం వలన అదనంగా సబ్సిడీ లభిస్తుందని ఆసక్తిగల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కనేకల్ విద్యుత్ ఏఈ శంకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఉరవకొండ విద్యుత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు పిఎం సూర్య ఘర్ సోలార్ ప్యానల్స్ మీద అవగాహన సదస్సు జరుగుతున్నది అని తెలిపారు.,కావున ఇప్పుడు ప్యానెల్ పైన జిఎస్టి కూడా తగ్గింది మరియు సబ్సిడీ వన్ కిలో వాట్స్ కి 30వేలు రెండు కిలోవాట్స్ కి 60వేలు మూడు కిలో వాట్స్ కీ 78వేలు మరియు బీసీలకు అదనంగా 20, వేలు సబ్సిడీ వస్తుంది అన్నారు. కావున ఉరవకొండ సబ్ డివిజన్ ఉరవకొండ విడపనకల్ కనేకల్ వినియోగదారులు శనివారం జరుగు అవగాహన సదస్సుకు విచ్చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఒక్కసారి సోలార్ ప్యానల్స్ వేసుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్తు పొందడం మరియు విద్యుత్ నీ ఆదా చేయడం జరుగుతుందన్నారు.

## పూల చెర్ల పంచాయతీలో కోటి సంతకాల రచ్చబండ

కనేకల్లు అక్టోబర్ 17 ప్రభాతవార్త



రచ్చబండ నిర్వహించిన వైసీపీ నాయకులు

మండల పరిధిలోని పూల చర్ల గ్రామ పంచా యతీ నందు రచ్చబండ కార్య క్రమం శుక్రవారం కనేకల్లు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా కనేకల్ మండల కన్వీనర్ పార్టీ బ్రహ్మానందరెడ్డి ప్రజల వద్ద నుండి కోర్టు సంతకాల సేకరణలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రచ్చు మర్రి హల్లి నాగరాజు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి మరియు రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయవద్దని జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్ద నుండి సంతకాల సేకరణలోభాగంగా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం లోనే మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపట్టారని తెలిపారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పేద బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో ప్రజారాంజిక పథకాలను ప్రవేశపెట్టి నవరత్నాల పేరుతో ప్రజలకు అందించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. ప్రజావ్యతిరేక పనులు చేస్తున్న ఈ ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్పి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పార్టీ బ్రహ్మానందరెడ్డి బీసీ విభాగంజిల్లా ప్రధాన కార్యదర్శి రచ్చు మర్రి హల్లి నాగరాజు జిల్లా ఉపాధ్యక్షులు మారంపల్లి మారెన్న రాయదుర్గం మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు వండ్రప్ప వేమన్న పూల చెర్ల సర్పంచ్ ఎంపీటీసీ నల్లంపల్లి పుల్లంపల్లి పూలచెర్ల గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు రక్షణ కల్పించండి



ప్రిన్సిపల్ కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ అక్టోబర్ 17 ప్రభాతవార్త

హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీలకు రక్షణ కల్పించాలని శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినిలు నిర్వహించారు. ఈ ర్యాలీకి పిడిఎస్యు విద్యార్థి సంఘం నాయకుడు బాబావాలి మద్దతు తెలిపారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబావాలి మాట్లాడుతూ కళాశాల హాస్టల్ లో దాదాపు 175 మంది విద్యార్థినీలు హాస్టల్లో ఉన్నారని కొద్దిరోజుల క్రితం హాస్టల్లో సెల్ ఫోన్ ల చోరీ జరిగిందని అప్పటినుంచి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు రక్షణ కల్పించాలని బాబావాలి కోరారు. రాత్రివేళ హాస్టల్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

## బస్సు యాత్ర గోడ పత్రికలు విడుదల




గోడ పత్రికలు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం అక్టోబర్ 17 ప్రభాతవార్త

విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఇచ్చాపురం నుండి హిందూపురం వరకు ఈనెల 22వతేదీనుండి జరుగుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ భాష, జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి లు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు మా పోరాటం ఆగదని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, యశ్వంత్, తేజ, బన్నీ, గణేష్, కిరణ్, గణేష్, అజయ్, అశోక్, లోకేష్, ఏల్లాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో పై ఎంపీపీ ఫిర్యాదు

### జడ్పీ సీఈవో ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు జారీ

రొళ్ల అక్టోబర్ 17 ప్రభాత వార్త:



రెస్టారెంట్ ఆవరణంలో ఎంపీడీవో వాహనం నిలిచిన దృశ్యం

మండల ఎంపీడీవోకు పై అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఎంపీడీవోపై పలు ఆరోపణలు రావడంతో పై అధికారులు విచారణకు ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్లో విధుల సమయంలో ఎంపీడీవో నాగేశ్వర శాస్త్రి ఉంటున్నారని ఎంపీపీ కవిత సీఈవో దృష్టికి పలుమార్లు తెలిపినట్లు పేర్కొంది. తెలిపిన సీఈవో పట్టించుకుపోగా అతనిపై ఎటువంటి చర్య తీసుకోలేదని చరవాణి ద్వారా జిల్లా కలెక్టర్ శ్యాంసుందర్ కు గురువారం ఎంపీపీ కవిత ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుల్లో విధులు నిర్వహిస్తున్నా సమయంలో రెస్టారెంట్ లో ఎంపీడీవో ఉండడం నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అతనిపై ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ తతంగం పై జడ్పీ సీఈవో శివశంకర్ ను వివరణ కోరగా శుక్రవారం ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సీఈవో చెప్పారు.

## కేటీఎస్ తో అవగాహన ఒప్పందం

రాయదుర్గం రూరల్ అక్టోబర్ 17 ప్రభాతవార్త

రాయదుర్గం స్థానిక కే.టీ.యస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరియు విశాఖపట్నానికి చెందిన సిఎస్సి ఇండియా కంపెనీకి మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం జరిగినట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్ కన్నా తెలియజేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి వచ్చిన కంపెనీ సీనియర్ కన్సల్టెంట్ రామ్మోహన్ రావు మరియు ప్రిన్సిపాల్ పరస్పరం అవగాహన పత్రాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ అవగాహన వల్ల కళాశాల విద్యార్థిని విద్యార్థులకు సిఎస్సి కంపెనీ ఇంటర్న్ షిప్ లు అందించబడతాయని ఆన్లైన్ ద్వారా ఆయా కోర్సులను నేర్చుకోవడం విద్యార్థిని విద్యార్థులకు ఒక మంచి అవకాశం అని, అదే విధంగా 2025 సంవత్సరానికి ఈ కంపెనీ ద్వారా ఉత్తమ మెంటార్ గా కళాశాల కు చెందిన డాక్టర్ ఏ. యస్.విజయ్ కుమార్ ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణం అని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరీషా పిర్దోష్, కిరణ్ జక్కల, బాలా నరసింహులు, బాబు, గురుమూర్తి, అమీర్ హుస్సేన్, గోవర్ధన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్‌యు-17 బెలుగుప్ప మండల స్థాయి వాలీబాల్ పోటీలు, ఎంపికలు

బెలుగుప్ప, అక్టోబర్ 17 ప్రభాతవార్త



ఎంపికైన బాలుర, బాలికల జట్లు

స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -17 బాల, బాలికల బెలుగుప్ప మండల స్థాయి వాలీబాల్ పోటీలు, ఎంపికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మండలములోని వివిధ పాఠశాలకు చెందిన 7 బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నరసాపురం మొదటి స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండ్లపల్లి రెండవ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెలుగుప్ప మూడవ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరసాపురం ప్రథమ స్థానం కే.జీ.బీ.వీ, బెలుగుప్ప ద్వితీయ స్థానం సాధించాయి. ప్రతిభ కనబరిచిన బాలుర, బాలికల జట్లు ఈనెల 21వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బెలుగుప్పలో జరిగే డివిజనల్ లెవెల్‌లో 11 మండలాల మధ్య జరిగే పోటీలలో పాల్గొంటారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రుద్రన్న, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గోపాల్ రెడ్డి, పిడి రాఘవేంద్ర, పిఈటి అనిత, మల్లోబన్న పిడి గంగాధర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## 15 సంవత్సరాల కలను నిజం చేసిన సర్పంచ్ మంజు

రొద్దం. అక్టోబర్ 17 ప్రభాత వార్త

గత 15 సంవత్సరాలుగా ఆర్డిటి కాలనీకి తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భంలో వారి కలను సర్పంచ్ మంజు నిజం చేశాడు వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో గత 15 సంవత్సరాల కాలంగా ఆర్ డి టి కాలనీ కి తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భంలో సర్పంచ్ మంజు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకుపోగా యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి కాలనీవాసులకు తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగింది




పైపులైను మరమ్మత్తులు చేయుస్తున్న సర్పంచ్ మంజు

కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ చాలాకాలంగా అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోగా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు మంత్రి దృష్టికి సమస్యను తీసుకుపోగా వెంటనే స్పందించి మా కాలనీవాసుల కు తాగునీరు సమస్యను పరిష్కరించినందుకు మంత్రికి సర్పంచ్ మంజు కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్



పనులను, ఇకెవైసిని పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్

బెలుగుప్ప, అక్టోబర్ 17 ప్రభాతవార్త

బెలుగుప్ప మండలం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సలీంభాషా శుక్రవారం సందర్శించారు. పర్యటనలో భాగంగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌లో యాక్టివ్‌గా ఉన్న ప్రతి వేజ్ సీకర్స్‌ను ఇకెవైసి చేయించిన యెడల భవిష్యత్‌లో పనులకు వచ్చేవారికి చెల్లింపులు సక్రమంగా జరగడానికి ఎన్ఎంఎంఎస్, ఫేస్‌యాప్ ద్వారానే అటెండెన్స్ తీసుకోబడుతుందన్నారు. దీని వలన పనిచేసినవారికి మాత్రమే చెల్లింపులు చేయబడుతాయన్నారు. పథకం సక్రమంగా అమలు కావటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొన్న నిర్ణయం. ఇకెవైసి చేస్తున్నపుడు వస్తున్న సమస్యలు తెలుసుకొన్నారు. సమస్యలు ఏవైనా ఉన్నా ఎప్పటికపుడు డిఆర్‌పి మదుతో అడిగి తెలుసుకోవాలన్నారు. ఇందులో అలసత్వం వహించుకుండా ఈ ప్రక్రియ 20తేది లోపల పూర్తి చేయలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 587919 గాను, 282260 మందికి చేయడం జరిగింది. అలాగే బెలుగుప్ప మండలంలో 16,899గాను 8000 మందికి చేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో మేట్స్, ఎఫ్ఎసి,కాకుండా యాక్టివ్‌యూత్స్ రిజిస్ట్రేషన్ చేసి కంప్లీట్ చేయాలని చేయాలని ఆదేశించారు. టిఎస్, ఇసి, ఎపిఓ ఎప్పటికప్పుడు యాక్టివ్‌రోల్ చేయాలని, అలాగే జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారంరోజునుంచి అన్నిపంచాయితీలలో పనులుజరిగేట్లు చూడాలని అదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ మురళీ క్రిష్ణ, ఇసి రామకృష్ణ, టిఎ అవినాష్, ఎఫ్ఏస్ ఎర్రిస్వామి, శివ, వన్నూరుస్వామి, నోమేష్, తిప్పేస్వామి, గణేష్, మేట్స్, వేస్, సీకర్స్, లోకల్ లీడర్స్ పాల్గొన్నారు.

## మా కలు "గోడు" పై కనికరం లేదా?

### కంపు కొడుతున్న కలుగోడు ఎస్సీ కాలనీ అధికారులు పర్యావేక్షణ లోపమే ప్రజలకు "శాపం"గా మారుతోందా?



బురదమయంగా కలుగోడు ఎస్సీ కాలనీ రోడ్డు , మురికి నీళ్లలో నడుస్తున్న కాలనీ వాసులు

గుమ్మఘట్ట అక్టోబర్ 17 ప్రభాతవార్త

కలుగోడు గ్రామ ఎస్సీ కాలనీ లో కాలనీ వాసులు గోడు షోషల్ మీడియా వేదికగా ఎస్సీ కాలనీ సమస్యగోడును స్థానికతహశీల్దార్ ఎంపిడిఓ సంబంధిత అధికారులుకు విన్నవించారు వివరాలు ఇలా మండల పరిధిలోని కలుగోడు గ్రామంలో ఉన్నటువంటి ఎస్సీ కాలనీలో ఉన్న రోడ్డు పరిస్థితి ఇది దాదాపు 3 సంవత్సరాలుగా సమస్య ఉందని ఎస్సీ కాలనీ కి రోడ్డు వేయాలని చెప్పి గత వైసిపి ప్రభుత్వం నాయకులను అధికారులను మరియు ప్రస్తుతం కూటమి నాయకుల పెద్దలను మరియు అధికారులు కూడా చాల సార్లు విజ్ఞప్తిచేశాం కానీ ఈవిషయంపైన ఎవ్వరు కూడా స్పందించలేదు ఎందుకని మాకు ప్రశ్నాత్మకంగా ఉంది మేము ఎస్సీలుగా పుట్టడం మా పాపమా మా కాలనీలు ఇంత అధ్వానంగా ఉంటే ఒక్క నాయకుడు కూడా ఒక అధికారి కూడా స్పందించలేనటువంటి దుస్థితి మండలంలో కలుగోడు గ్రామంలో నెలకొన్న సమస్య పరిష్కరించాలని కోరుతూ పలు మార్లు ఉన్నతాధికారులు దృష్టి కూడా తీసుకెళ్లిన ఫలితం శూన్యం ఇప్పటికైనా చిన్న పిల్లల స్కూల్ కి వెళ్తున్నప్పుడు ఈమురుగు నీళ్లలో వెళ్లే రావలసినటువంటి పరిస్థితి వస్తోంది కాబట్టి సమస్యపరిష్కారించకపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించ దానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడించబోతున్నామని తెలియజేస్తున్నాం మేము ఆకలినైనా భరిస్తాం అవమానాలను భరించలేమని కనీస అవసరాలు మోలిక వసతులు తీర్చమని ప్రభుత్వ పెద్దలను విజ్ఞప్తి చేస్తున్నాం చాలా ఓపిక సహనంతో ఇన్ని రోజులు కూడా ఉన్నాము దయచేసి మా విజ్ఞప్తిని అర్థం చేసుకొని అధికారులు ఇటు నాయకులు ఈ సమస్య పరిష్కరించడానికి ముందుకు రావలసిందిగా కాలనీ వాసులు ఎంఆర్‌పియస్ దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేసారు ఈ విషయం పై ప్రభాత వార్త ఎంపిడిఓను వివరణ కోరగా గ్రామంలో ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్య ను క్షేత్ర స్థాయిలో పరిశీలించి కాలనీ వాసులుకు సమస్య ను పరిష్కరిస్తామని చెప్పారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ ముగింపు వారోత్సవాలు

కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్ వి జిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టి 2. వీ వారోత్సవాలుశుక్రవారం ఘనంగా ముగిశా యి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హర్షల మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సూపర్‌జీఎస్టీవల్ల ఎంతోమంది ప్రజలకు మంచిచేకూరుతుందని పేర్కొన్నారు. జీఎస్టీ వారోత్సవాలు భాగంగా పట్టణంలోని కిరాణా దుకాణం, బట్టల షాపులవద్దకువెళ్లి విద్యార్థులతోకలిసి అవగాహనకల్పించామని తెలియజేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శేషయ్య తదితర కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలిసి పరిటాలశ్రీరామ్

### ధర్మవరం,రాప్తాడు నియోజకవర్గాల్లో రైల్వే సమస్యలను వినతి

ధర్మవరంటౌన్, అక్టోబరు 17 ప్రభాతవార్త



కేంద్ర రైల్వేశాఖ మంత్రి సోమన్నను కలిసిన పరిటాలశ్రీరామ్

ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఉన్న రైల్వేసమస్యలను కేంద్ర రైల్వేసహాయ మంత్రి సోమన్నకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ విన్నవించారు. శుక్రవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి సోమన్న రాయదుర్గం టుముకూరు మధ్య జరుగుతున్న రైల్వే పనులను పరిశీలిం చేందుకు పావగడకు వచ్చారు. విషయం తెలుసుకున్న పరిటాలశ్రీరామ్ రైల్వేశాఖ మంత్రి సోమన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మవరం, రాపా దునియోజకవర్గాల్లో నెలకొన్న రైల్వేసమస్యలను వివరించారు. ఇప్పటికే వీటిపై వినతపత్రాలు కూడా ఇచ్చానట్టుతెలిపారు. అనంతరం పలురాజకీయ, ఇతర అం శాలగురించి చర్చించుకున్నారు. పరిటాల కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్న క్రమంలో మంత్రిసోమన్న ఎమ్మెల్యే పరిటాలసునీతతోపాటు ఇతర కుటుం బసభ్యుల యోగక్షేమాల గురించి అడిగితెలుసుకున్నారు. మంత్రిని పరిటాలశ్రీరామ్ తో పాటు హిందూపురం ఎంపీ బీకేపార్థసారది, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి,పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ తో పాటు పలువురు నాయకులు కలిసి నవారిలో ఉన్నారు.

## ఉద్యాన పంటల సాగుపై అవగాహన కార్యక్రమం

కంబదూరు, అక్టోబర్ 17, ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్

కంబదూరు మండలం లోని ఓబగానిపల్లి గ్రామం లో శుక్రవారం ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల రైతులకు ఉల్లి, మామిడి, టమోటా, కర్బుజా,సపోటా ,మిరప వంటి ఉద్యాన వన పంటలపై అవగాహన కల్పించారు. పైరు దశలో ఉన్నప్పటి నుంచి పూత,కాయ దశలలో ఉన్నపుడు తీసుకోవాల్సి న జాగ్రత్తలు ,యాజమాన్య పద్ధతుల గూర్చి ఉద్యాన శాఖ అధికారులు రైతులకు వివరించారు. రైతులు సాగు చేసిన పంట ను ఈ క్రాప్‌లో నమోదుచేసుకోవాలని ఆగ్రామరైతులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీఎరువులు, డ్రిప్‌వంటి వివరాలను తెలియజేశారు. కళ్యాణదుర్గం లక్ష్మీదేవమ్మ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త యుగంధర్, ఉద్యానవన శాఖాధికారి గౌసియా, అగ్రికల్చర్ అసిస్టెంట్ గాయత్రి ఆ గ్రామ ఉద్యానవన రైతులకు అవగాహన కల్పించినవారిలో ఉన్నారు.

## గుంతకల్లులో సినీ తారల సందడి

గుంతకల్లు, అక్టోబర్ 17 ప్రభాతవార్త



మీడియాతో మాట్లాడుతున్న హీరోయిన్లు

గుంతకల్లు పట్టణంలో సినీ తారలు సందడి చేశారు. సంక్రాంతికి వస్తున్నాం, మిరాయి చిత్రాల్లో నటించిన ఐశ్వర్య రాజేష్, రితినాయక్‌లు రైల్వే స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శుభప్రదమ్ షాపింగ్‌మాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలను శుభప్రదమ్ షాపింగ్‌మాల్ యాజమాన్యం అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. హీరోయిన్లను చూడడానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా వన్ టౌన్ సిఐ మనోహర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లక సత్యనారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలకు నీటి ట్యాంక్ వితరణ



నీటి ట్యాంకు అందజేస్తున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త

మండలంలోని కే.ఊబిచర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం భాస్కర్ 1000 లీటర్ల సామర్థం కలిగిన నీటి ట్యాంకును అందజేశారు. ఉపాధ్యాయులు ఓబులేసు, ప్రకాష్‌ల సూచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని దాత భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## పకడ్బందీగా నూతన ఓటర్ల జాబితా తయారీ

### ఇంచార్జ్ డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి

పుట్టపర్తి (కల్చరల్), అక్టోబర్ 17 , ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి

పకడ్బందీగా నూతన ఓటర్ల జాబితాను తయారు చేయడంలో భాగంగా భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు అతి త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రారంభించ బోతున్నట్లు ఇన్చార్జ్ డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ ఆదేశం మేరకు ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇంచార్జీ డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ , రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నందు ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడం గురించి అన్ని రాజకీయ పార్టీల నుండి అభ్యంతరాలు మరియు సూచనలు తెలుపవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమం నందు బి ఎల్ ఓలు ఇంటింటికీ తిరిగి కొత్త వోటర్ల జాబితాను తయారు చేస్తారనీ, ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం చాలా పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యం లో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 1819 వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు, రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి వాటి జాబితాలను వెంటనే సంబంధిత నియోజకవర్గ ఎన్నికల అధికారికి సమర్పించవలసినదిగా ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జీ డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ జాకీర్ హుస్సేన్, టిడిపి పార్టీ ప్రతినిధులు ఎస్. ఆదినారాయణ, బిజెపి ఎన్. కళ్యాణ్ కుమార్, సీపీఎం ఈ. ఎస్. వెంకటేసులు, వైఎస్సార్ పి. వెంకట్, జనసేన శ్రీనివాసులు, జి. సతీష్ కుమార్, ఇతర ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

## - అంగన్‌వాడి కార్యకర్తలు - ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

పామిడి, అక్టోబర్ 17 ప్రభాతవార్త

బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని అందువల్ల బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అంగన్‌వాడి కార్యకర్తలు జే.ఎల్. నారాయణమ్మ, ప్రేమకుమారి, జ్యోతి, ఎన్.నారాయణమ్మ పిలుపుని చ్చారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడి కేంద్రం నందు అంతర్జాతీయ బాలికల దినోత్స వాన్ని పురస్కరించుకుని శుక్రవారం అంగన్‌వాడి కార్యకర్తలు జే.ఎల్. నారాయణమ్మ, ప్రేమకుమారి, జ్యోతి, ఎన్.నారాయణమ్మ బాల్య వివా హాలు వాటి ద్వార ఉత్పన్నమయ్యే సమస్యలపై కిశోర బాలికలకు అవగాహణ కల్పించారు.

బాల్య వివాహ నిషేదిత చట్టం ప్రకారం 18 ఏళ్ళలోపు ఉన్న టువంటి అమ్మాయికి 21 ఏళ్ళలోపు ఉప్ప అబ్బాయికి వివా హం చేస్తే ఎంత టివారైనప్పటికీ కఠిన చర్యలు తప్పవన్నారు. అమ్మాయిలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో అబ్బా యిలను అంతే జాగ్రత్తగా చూసు కోవాలని తెలిపారు. రోజు రోజుకు బాలిక లపై వివక్షత పెరిగి పోతు oదని దానిని అరికట్టాల్సి న బాధ్యత మనందరి పై ఉందన్నారు. బాల్య వివా హాలు అనర్ధ దాయకమని వా టి కారణంగా అనేక నష్టాలు సంభవి స్తాయంటూ బాలల హ క్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు పాటుప డుతున్నాయని తెలి యజేశారు. ఈకార్యక్రమంలో కిశోర బాలికలు వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.



.బాలల హక్కులు, బాల్య వివాహాల ని ర్మూలనపై అవగాహణ కల్పిస్తున్న దృశ్యం

# సెంచురీలతో చెలరేగిన ఆంధ్ర బ్యాట్స్‌మెన్స్

అనంతపురం సిటీ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

ఆర్డిటి క్రీడా వేదికగా జరుగుతున్న కల్నల్ సికె నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ ్‌లలో ఆంధ్ర జట్టు బ్యాట్స్ మెన్‌లు సెంచురీలతో చెలరేగి రెండవ రోజు 470/4 తో కొనసాగుతున్నారు. ఆంధ్ర-ఢిల్లీ జట్ల మధ్య నాలుగు రోజుల పాటు జరుగుతున్న సికె నాయు డు ట్రోఫీ మ్యాచ్‌లలో రెండోరోజు ఆంధ్ర బ్యాట్స్‌మెన్‌లు ఎస్‌వి.రాహుల్, అభిన వ్‌లు సెంచురీల మోత మోగించారు.

ఎస్‌వి.రాహుల్ 292 బంతుల్లో 15 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 151 పరుగులు సాధించారు. అభినవ్‌కూడా 190 బంతుల్లో 101 పరుగులు సాధించారు. ఢిల్లీ బౌలర్లతో యుగల్ సైని రెండు వికెట్లు, లక్ర ఒక వికెట్, భరద్వాజ్ ఒక వికెట్ సాధించారు. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రజట్టు తొలి ఇన్ని oగ్స్‌లో 470/4 వికెట్లుతో కొనసాగుతోంది. మ్యాచ్‌లను ఎడిసిఏ కార్యదర్శి భీమ లింగారెడ్డి పర్యవేక్షించారు.



ఆంధ్ర-ఢిల్లీ మధ్య జరుగుతున్న మ్యాచ్ దృశ్యం



151 పరుగులు సాధించిన రాహుల్



సెంచురీ చేసిన అభినవ్

# ఆడపిల్లలను సంరక్షించడం అందరి బాధ్యత

## - హెచ్ ఓ శివప్రసాద్

రాప్తాడు,

అక్టోబర్ 17 మప్రభాతవార్త

ఆడపిల్లలను సంరక్షించడం అందరి బాధ్యత అని హెచ్ ఓ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎం.బండ మీద పల్లి జడ్పీహెచ్ స్కూల్లో సేవ్ ద గర్ల్స్ చైల్డ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఆడపిల్లలను ఆదిలోనే అంతం చేయకుండా కాపా డాలన్నారు. లింగ నిష్పత్తి పెం చాలని అందరితో పాటు సమానత్వం సాధించేలా చూడాలన్నారు. మండలంలోనే బాలికలం దరు చదువుకు నేందు కు బాధ్యత తీసుకోవాలని కోరారు. బాల్యవివాహాలు అరికట్టేలా అధికా రులు చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ చట్టం కఠినంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోరారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆయుబ్, సూపర్వైజర్ నరసింహ, ఎంపీ హెచ్‌ఏ గోపాల్, అంగన్వాడి టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచక్ష శివ ప్రసాద్

# జిఎస్‌టి తగ్గింపుతో క్రీడాకారులకు ఉప యుక్తం

## - డిఎస్‌ఓ మంజుళ





ర్యాలీలో పాల్గొన్న డిఎస్ఓ, కమర్షిల్ ట్యాక్స్ అధికారులు

అనంతపురం సిటీ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి తగ్గింపు వల్ల క్రీడా కారులకు ఉప యుక్తంగా మార నున్నదని జిల్లా క్రీడాభివృద్ది అధికారిని మంజుళ పేర్కొ న్నారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ ఉత్సవాల్లో భాగంగా జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగా హన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ది అధికారిని మంజుళ, అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ గోవర్దన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ది అధికారిని మంజుళ మాట్లా డుతూ.. గతంలో క్రీడా వస్తువులపై 12 శాతం జిఎస్‌టి ఉండగా ప్రస్తుతం తగ్గింపు వల్ల 5 శాతం మాత్రమే జిఎస్‌టి వర్తిస్తోందన్నారు. క్రీడా వస్తువులపై జిఎస్‌టి తగ్గింపు వల్ల క్రీడా కారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. క్రీడా కారులు తగ్గింపు జిఎస్‌టి వల్ల క్రీడా వస్తువులను కొనుగోలు చేసి శారీరక ధృఢత్వం మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హైవేలో బస్సులో అగ్నిప్రమాదం..ప్రయాణికులందరూ సురక్షితం



పూర్తిగా దగ్ధం అయి పోయిన ప్రైవేట్ బస్సు



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గార్లదిన్నె అక్టోబర్ 17ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలకేంద్రంలోని స్థానిక తలగాచిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు బెంగళూరు నుండి దేవదుర్గకు వెళ్తున్న గ్రీన్ లైన్ ట్రావెల్స్ ఏసీ బస్సు నంబర్: ఎన్ఎల్ 01బి 1524 హైవే నంబర్ 44పై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని బస్సు ఇంజిన్ భాగంలో షార్ట్ సర్క్యూట్ కారణ oగా మంటలు చెలరేగాయి దింతో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహ రించడంతో ప్రయాణికులందరినీ సురక్షితంగా బస్సు నుండి దించారు, అందువల్ల పెద్ద ప్రమాదం తప్పింది. అనంతపురం అగ్నిమాపక సిబ్బంది తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని డివిజనల్ అగ్నిమాపక అధికారి లింగమయ్య పర్యవేక్షణలో మంటలను అదుపులోకి తెచ్చారు. బస్సు పూర్తిగా దగ్ధమైంది అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో కొద్దిసేపు హైవే మీద రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న గార్లదిన్నె ఎస్సై మహ్మద్ గౌస్ భాష ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# సహకార సంఘం ద్వారా రైతులకు రుణాలు పంపిణీ

## - సహకార సంఘం చైర్‌పర్సన్ కృష్ణమెహన్‌చౌదరి

ఆత్మకూరు,

అక్టోబర్ 17 ప్రభాతవార్త

సహకార సంఘం ద్వారా రైతులు అభివృద్ధి సాధ్యడు తుందని సహకార సంఘం చైర్మెన్ కృష్ణమోహన్ చౌదరి పేర్కొన్నారు. శు క్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో రైతులతో ఆర్థిక, రుణాలపై అవగా హన కార్యక్ర మం ఏర్పాటుచేశారు. ఈ సందర్భ oగా చైర్‌పర్స న్ కృష్ణమో హన్ చౌదరి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు పలు రకాల రణాలు అందించి వారి అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. రైతులు కూడా సకాలంలో రణాలు చెల్లించి సొసైటీ సంఘం బలోపేతం చేసుకోవాల న్నారు. అనంతరం కొత్తగా 15 మంది రైతులకు 15 లక్షల రూపాయలు స్వల ్పకాలిక రుణాలు పంపిణీ చేయడం జరిగింది. జనతా ఇన్సూ రెన్స్ ద్వారా ప్రమాద భీమా వడ్డిపల్లికి చెందిన రామచంద్రారెడ్డి భార్య లక్ష్మినారాయ ణమ్మకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ మేనేజర్ స్టీఫెన్‌కుమార్, సీఈఓ హనుమంతరెడ్డి, డైరెక్టర్లు బొమ్మయ్య, నారాయణప్ప, మండల నాయకులు రవీంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండల రైతులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు స్వల్పకాలిక రుణాలు అందిస్తున్న చైర్‌పర్సన్, సిబ్బంది

# శ్రీకాళికాదేవికి కుంకుమార్చనలు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి అమ్మవారు శుక్రవారం విశేష అలంకరణలో దర్శన మిచ్చారు. ఉదయం అర్చకులు వీరబ్ర హ్మం ఆచార్యులు అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చ నలు, మహా మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



కాళికాదేవిని అలంకరించి న దృశ్యం

# ఆసక్తిగల వారు కొటేషన్లు సమర్పించాలి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలి oగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుండి నవంబర్ 20వతేదీ వరకు కార్తీకమాసం పురస్కరించుకుని ఆలయంలో కరెంట్ డెకరేషన్, పూల డెకరేషన్, తడికల పందిళ్లు, క్యూలైన్లు, సప్లయర్స్ సామానుల సప్లై చేయు తదితర పనులకు ఆసక్తిగల వారి నుండి కొటేషన్లు కోరుతున్నట్లు ఆలయ ఇఒ రామాంజనేయులు తెలిపారు. కావునా ఆసక్తిగల వారు వారం రోజులలోపు కొటేషన్లను దేవస్థానంలో సమర్పించాలని ఇఒ తెలిపారు.

# స్పోర్ట్స్ ఫేక్ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోండి

## - రిజిస్ట్రార్‌ను కోరిన ఏఐఎస్‌ఎఫ్ నేతలు

అనంతపురం సిటీ,

అక్టోబర్ 17 ప్రభాతవార్త

శ్రీకృష్ణ దేవరాయ యూని వర్సిటీలో స్పోర్ట్ ్స సంబంధిత ఫేక్ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకో వాలని రిజిస్ట్రార్ రమేష్‌బాబుని ఏఐఎస్‌ఎఫ్ యూనివర్సిటీ కార్య దర్శి రమణయ్య డిమాండ్ చేశారు. స్పోర్ట్ ్స సెలక్షన్ కమిటీ లో రెగ్యుల ర్‌గా ఉన్న వ్యక్తులను కాకుండా గెస్ట్ ఫ్యాకల్టీని నియ మించి ఫేక్ సర్టిఫికెట్లను అందిం చారని ఆయన విమర్శించారు. బికాం కంప్యూటర్స్ చదువుతున్న సమీర్‌ను హాకీ టీంలో చేర్చడం వల్ల విద్యార్థి గాయపడి ఆసుపత్రిలో ఆరు నెలలపాటు గడిపారన్నారు. యూనివర్సిటీ పరిధిలోనే సైన్స్, ఆర్ట్ ్స ఇంజి నీరింగ్, ఫార్మసీ, బిఇడి కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ఒక టీంగా ఆడకు oడా వేరువేరుగా విభజించి ఎస్ కెయూ టీంలుగా బలహీన పర్చడం వల్ల అనుకున్న లక్ష్యాలను సాధించ లేకపోయారన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపించి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా స్పోర్ ్ట్స సెలక్షన్ కమిటీ, ఫేక్ సర్టిఫికెట్లను అందించిన జన్సిపై చర్యలు తీసు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు సాయి మహేష్, జగదీష్, శీనునాయక్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

# నేడు వార్డెన్ అంతిక్రియలు

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

అనంతపురం బిసి డిఎన్‌టి హాస్టల్ వార్డెన్ రవీంద్రనాథ్ ఠాగూర్ గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసింది. ఆయన మృతి దేహం అదే రోజు రాత్రి జిల్లా కేంద్రంలో బళ్లారు బైపాస్ సమీపంలో ఉన్న తన సగృహానికి చేరింది. కుమార్తె యూఎస్‌లో చదువుతుం ది. రావడానికి మూడు రోజుల సమయం పడుతుంది. శనివారం తెల్లవారుజామున అనంతపురం చేరుకొని అవకాశం ఉంది. అందువలన శుక్రవారం జరగాల్సి న ఆయన అంత్యక్రియలను శనివారం అనంతపురం ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ఉన్న స్మశాన వాటికలో ఉదయం 10 గంటల సమయంలో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. డిడి కుష్బూ కొఠారి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్లు సుభాషిని, రంగమ్మ, మస్తాన్, బీసీ హాస్టల్స్ వార్డుల సంఘం జిల్లా అధ్యక్షులు అశ్వర్ధ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, సహచర వార్డెన్లు వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. అలాగే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే దహన సంస్కరణకు రూ.25 వేలు అనంతపురం అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిని అందజేశారు. అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ మస్తాన్ తో పాటు రెండు రోజులుగా అక్కడే ఉన్నారు.



వార్డెన్ రవీంద్రనాథ్ ఠాగూర్

# 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

నంబులపూలకుంట, అక్టోబర్ 17 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్‌పి.కుంట మండలములోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 3వ శనివారం "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు మండలంలోని గ్రామ పంచాయతీలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర క్లీన్ ఎయిర్ కార్యక్రమం నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రజా పరిషత్ అధికారులు తెలియజేశారు. మొక్కలు నాటుట, వాయు కాలుష్యం గురించి అవగాహన సదస్సులు నిర్వహించడం, స్థానిక వాతావరణ చర్యలు, పచ్చదనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన, మొక్కలు నాటడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ విద్యార్థుల చేత ్‌మానవ హారర, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిం చాలన్నారు. కావున అందరు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మీ స్థానిక ప్రజా ప్రతినిధులను, నాయకులను కలుపుకొని ఈ కార్యక్రమమును విజయవంతంగా పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు.

# ముగిసిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

నగరంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ క్వాంటర్ ఏజ్ బిగిన్స్ : పొటెన్షియల్ అండ్ ఛా లెంజెస్‌లో విశేష ప్రతిభ కనబర్చి విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మొదటి స్థానంలో హాజియా తబస్సుం 9 వ తరగతి, ఎపి మోడల్ స్కూల్ తాడ ిపత్రి, 2వ స్థానంలో ఉదిత్ 9 వ తరగతి, రైల్వే హై స్కూల్, గుంతకల్, న్యాయ నిర్ణేతలుగా స్థానిక ఆర్ట్స్ కళాశాల అధ్యాపకలు డా.కిషోర్, చంద్ర శేఖర్ వ్యవహరించారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ, ఎన్‌జి సి రీజనల్ కోఆర్డినేటర్ ఆనంద భాస్కర్ రెడ్డి సైన్స్ సెమినార్‌ను నిర్వహించారు. విజేతలను జిల్లా విద్యా శాఖాధికారి ప్రసాద్ బాబు, ఎడిడి సమగ్ర శిక్ష అదనపు సమన్వ యకర్త శైలజ అభినందించారు. విజేతలు 18న విజయ వాడలో జరుగబోయే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.



సర్టిఫికెట్లు అందుకుం టున్న విద్యార్థిని హాజియా తబస్సుం

# కౌశల్ క్విజ్ 2025 పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

కౌశల్ క్విజ్ 2025 పోస్టర్లను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి యం. ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ, కౌశల్ జిల్లా సమన్వయ కర్త ఆనందభాస్కర రెడ్డిలతో పాటు విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ఎడి శ్రీనివాసులు, ఎఎస్‌ఓ శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌టియు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి గారు జిల్లా లోని ప్రతి ఉన్నత పాఠశాల కౌశల్ క్విజ్‌లో పాల్గొనునట్లు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు తగు చర్యలు తీసుకోవాలని, రేపటి పాఠశాల కాంప్లెక్స్ సమావేశాల్లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కౌశల్ క్విజ్‌లో నమోదు అయ్యేలా చూడాలని తెలియచేశారు.

# ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

యాడికి,

అక్టోబర్ 17 ప్రభాతవార్త

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి నిరస నగా యాడికి మండల కేంద్రం లోని శ్రీచెన్నకేశవస్వామి ఆల యం వద్ద నుండి తహశీ ల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్ పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహిం చారు. అనంత పురం జిల్లా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఇన్‌చార్జ్ ముమ్మిడి వరపు చిన్న సుబ్బారావు మాదిగ, అనంతపురం జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు బి.హరిగోపాల్ మాదిగ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి జరగడం రాజ్యాంగంపై దాడి జరిగినట్టుగా భావిస్తున్నామన్నారు. భారతదేశంలో దళిత వర్గాల ప్రజలు ఏ స్థాయిలో ఉన్న ఇలాంటి అగత్యాలు జరగడం చాలా బాధాకరమైన విషయ మన్నారు. ఈ దాడికి పాల్పడినటువంటి వారిని వెంటనే శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు బాలు పాతకుంట్ల మాదిగ, యాడికి మండల గౌరవ అధ్యక్షులు వెంగళ శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి జానకిరాముడు, మండల ఉపాధ్యక్షులు చిటికెల చిరం జీవి, మండల ఉపాధ్య క్షులు నల్లప్ప, మండల కోశాధికారి విజయ్, మండల కార్యదర్శి సాగర్, ఎంఎస్‌పి నాయకులు నరసింహులు, సూర్యుడు, గాంధీ, కులాయప్ప, రామాంజనేయులు, డి.వెంకటేష్, గుర్రప్ప, రవికుమార్, టైలర్ పుల్లయ్య, టైలర్ బద్రి, పందు శ్రీరాములు, శంకర్, నాగేష్, సూర్యనా రాయణ, చిన్న రాముడు, డప్పు కళాకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జె.సి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో శుక్రవా రం జరిగిన పలు వివాహాలకు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందు లో భాగంగా పట్టణంలోని పద్మా వతి, ఎఎన్‌ఆర్, సత్యసాయి కళ్యాణమండపాలతో పాటు రూ రల్ పరిధిలోని పెద్దపొలమడలో జరిగిన వివాహాలకు ఎమ్మెల్యే హాజరై నూ తన వధూవరులను ఆశీర్వదించి వారికి గిఫ్ట్ అందచేసి శుభాకాంక్షలు తెలియ చేశారు. ఎమ్మెల్యే వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.



వధూవరులకు గిఫ్ట్ అందచేస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

# బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధిగా నరిశెట్టి ఆదిశేషు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా నరిశెట్టి ఆదిశేషు (హైకోర్టు అడ్వకేట్)ను అధిష్ఠానం నియమించింది. ఆంధ్రప్ర దేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్ర మీడియా ప్రతినిధుల జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా తాడిపత్రికి చెందిన హైకోర్టు అడ్వకేట్ నరిశెట్టి ఆదిశేషు రాష్ట్ర మీడియా ప్రతినిధిగా నియమి తులయ్యారు. రాష్ట్ర రాజధాని కేంద్రంగా ఆదిశేషు పార్టీ విధానాలు మరియు సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని కల్పించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, బిజెపి రాష్ట్ర సంఘటనా కార్యదర్శి మధుకర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి ముఖ్యంగా యువతలోకి బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



ఆదిశేషు

# దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలి

## - ఎస్ఐ ప్రదీప్‌రాజ్

అమడగూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఎస్ఐ ప్రదీప్‌రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టపాసులు ఎక్కడైనా కాళీ ప్రదేశాల్లోనే కాల్చుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే టపాసులు కాల్చాలన్నారు. కాల్చే ముందు నీటి బకెట్ లేదా ఇసుక బుట్ట దగ్గర ఉంచుకోవాలన్నారు. కాలిన టపాసులను వెంటనే తాకరాదని గాలి దిశను గమనించి కాటన్ దుస్తులు ధరించడం చాలా మంచిదన్నారు. సింథటిక్, సిల్క్ దుస్తులు ప్రమా దకరమన్నారు. చేతిలో పట్టుకుని రాకెట్ లేదా చక్రం కాల్చరాదని. అధిక శబ్దం వచ్చే టపాసులు వాడ డం నిషేధమన్నారు. రోడ్లపై టపా సులు కాల్చడం ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తుందని ఇది నేరమ న్నారు. అనుమతి లేకుండా టపా సుల దుకాణాలను ఏర్పాటు చేస్తే చట్టపo రమైన చర్యలు తీసుకుంటా మన్నా రు. పిల్లలు, వృద్ధులు, జంతు వులుపై జాగ్రత్త వహించాలని, చిన్న పిల్లలకు ప్రమాదకరమైన టపాసులు ఇవ్వరాదన్నారు. ప్రమాదవశాత్తు గాయపడితే వెంటనే ఆసుపత్రికి తరలించాలని అత్యవసర సహాయం కోసం 100, 112, 101కు కాల్ చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణగౌడ్, భాస్కర్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ ప్రదీప్‌రాజ్

# పత్రికా స్వేచ్ఛ ను పరిరక్షించండి



కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు

పుట్టపర్తి, అక్టోబర్ 17, ప్రభాతవార్త

కల్తీ మద్యం దందా పై కథనాలు రాసిన సాక్షి దినపత్రికకు నోటీసులు, విచారణ పేరుతో పదే పదే కార్యాలయంలోకి పోలీసులు ప్రవేశించడం సరికాదని, పత్రికల పట్ల వేధింపులు గురికాకుండా పత్రిక సెక్షన్ పరిరక్షిం చాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరే ట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ కు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించరాదని, ప్రభుత్వ ఒత్తిళ్లతో హైదరాబాద్‌లోని సాక్షి కార్యాల యంలోకి పోలీసులు పదే పదే వెళ్లడాన్ని పాత్రికేయ రంగం ఖండిస్తోం దన్నారు. ఏదయినా ఫిర్యాదు ఉంటే ఒకసారి వెళ్లి విచారణ చేయాలని పదే పదే వెళ్లి బెదిరించే ధోరణిలో వ్యవహరించడం సమంజసం కాదన్నారు. అంతేకాకుండా పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వానికే మాయని మచ్చ అని, కల్తీ మద్యం దందా కు సంబంధించి సాక్షి దినపత్రిక లో వచ్చిన కథనాలపై ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడంతో పాటు, ఆయన చాంబర్‌కు వెళ్లి గంటల తరబడి విచా రణ చేయడం సరికాదన్నారు. సాక్షి యాజమాన్యం పట్ల పోలీసుల తీరును పాత్రికేయ రంగం తీవ్రంగా తప్పు పడుతోందనీ , పాత్రికేయులను ఇరకాటంలో పెట్టే విధంగా చేయడం సరికాదన్నారు.

# గోకులం పాఠశాలను సందర్శించిన డీఈవో

పుట్టపర్తి (కల్చరల్), అక్టోబర్ 17, ప్రభాతవార్త

పుట్టపర్తి లోని గోకులం మండల పరిషత్ పాఠశాలను శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి క్రిస్టప్ప, మండల విద్యాశాఖ అధికారి ఖాదర్ వలిలు సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ప్రగతి, మూల్యాంకన పుస్తకాలు ,సాధన పుస్తకాలు మరియు సంగ్రహణ మూల్యా oకనం 2 కు సంబంధి oచిన విషయాలన్నీ పరిశీలించారు. అనంతరం పిల్లల చేత చదివించి లెక్కలు చేయించారు. .పాఠశాల విద్యార్థులకు పలుసూచనలు చేస్తూ రాయడంలో మెళుకువలు మరియు ఇంగ్లీషులో రోజు కొన్ని పదాలు నేర్చుకొని వాటితో చిన్న చిన్న వాక్యాలు మాట్లాడడం మరియు రాయడం అలవర్చుకోవాలని తెలియజేశారు. .పాఠశాల నిర్వహణ విద్యార్థుల ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ గాలి, గాలి కాలుష్య, నివారణ చర్యలు వాటిపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి, ఉపాధ్యా యులు పి వి రమణారెడ్డి, రాంమోహన్ రెడ్డి, కళ్యాణి మరియు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో ఉన్నత స్థానాలకు ఎదగాలి..

## బిసి సంక్షేమ వసతి గృహంలో రాత్రి బసచేసిన జిల్లాకలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్

శ్రీ సత్య సాయి జిల్లా, అక్టోబర్ 17, ప్రభాతవార్త ప్రతినిధి విద్యా ర్థులు కష్టపడి చదివి విద్యతోనే ఉన్నత స్థానాలకు ఎదగాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొ న్నారు. పుట్టపర్తిలోని సాంఘిక సంక్షే మ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి కలెక్టర్ సందరి ్శంచి విద్యార్థుల పరిస్థితిని స్వయంగా పరిశీలి oచారు. విద్యార్థుల వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, విద్యా సదుపాయాలు, మరియు ఇతర సౌకర్యాలపై సమగ్ర సమీక్ష నిర్వహిం చారు. కలెక్టర్ విద్యా ర్థులతో కలిసి భోజనం చేసి, విద్యార్థులతో ముచ్చటి oచారు. ముఖ్యం గా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వి ద్యార్థులు ధైర్యంగా చదువుకుని మంచి స్థానాల్లో నిలవాలని సూచించారు. "ప్ర భుత్వం మీ భవిష్యత్తు కోసం అన్నివిధాలుగా కృషి చేస్తోందని, మీరు కష్ట పడి చదివి విజయాలను సాధించాలి" అని కలెక్టర్ విద్యార్థులను ప్రోత్స హించారు. రాత్రి అదే వసతి గృహంలో కలెక్టర్ బస చేసి విద్యార్థుల దైనం దిన జీవన విధానాన్ని దగ్గరగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహ oలో పరిశుభ్రత, భోజన మెనూ, మరియు భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ వార్డెన్ టి . విజయ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలతో కలిసి వసతి గృహం లోనే నిద్రిస్తున్న జిల్లా కలెక్టర్

# వైభవంగా శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవం

తాడిపత్రిరూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్స వం శుక్రవారం వైభవంగా జరిగింది. పార్నపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామాంజనేయులు కుటుంబసభ్యులు స్వామివారి కళ్యాణోత్స వాన్ని జరిపించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ, సుగంధపుష్పాలతో శాస్త్రోక్తంగా వేదపండితులు సుబ్బారావు, రంగనాథశర్మలు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామివారి కళ్యాణోత్స వాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. హాజరైన భక్తులు నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు చేశారు.

## చిన్నారి సుఖీభవ



పి.హితేష్‌రెడ్డి
తల్లి : పి.యశోద
తండ్రి : పి.విజయ శంకర్‌రెడ్డి
శింగనమల గ్రామం

04ATP17_04ATP17.qxd 17-10-2025 PM 10:52 Page 1



# అవకాశం ఉన్న ప్రతి చెరువుకు హంద్రీనీవా నీరు అందిస్తాం

## - గత ప్రభుత్వం ఒక్క చెరువుకైనా నీరు అదనంగా ఇచ్చిందా..? - వైసీపీని నిలదీసిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత - యర్రగుంట వద్ద హంద్రీనీవా నీటిని పరిశీలించిన ఎమ్మెల్యే సునీత

రాప్తాడు, అక్టోబర్ 17 ప్రభాతవార్త

గత వైసీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా ద్వారా ఒక్క చెరువుకైనా అదనంగా నీరు అందించారా అంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రశ్నించారు. రాప్తాడు మండలం యర్రగుంట గ్రామం సమీపంలో హంద్రీనీవా నీటితో పొంగి పొర్లుతున్న చెక్ డ్యాంను ఆమె పరిశీలించారు. పండమేరు వాగు ద్వారా అనంతపురం చెరువుకు వెళ్తున్న సాగునీటిని పరిశీ లించారు. వాగు మధ్యలో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏమైనా ఉన్నాయా అన్నది ఆరా తీశారు. అలాగే ఎక్కడా నీటి వృథా కాకుండా చూడాలన్నారు. ఎక్కడైన నీటి వృథా జరుగుతోంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో అవకా శం ఉన్న ప్రతి చెరువుకు నీరు అందిస్తా మని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. హంద్రీనీవా నీటిని కుప్పా నికి తీసుకెళ్తున్నారని దుష్ప్రచా రం చేస్తున్నారని.. అదే నిజమైతే ఇప్పుడు చెరువులకు నీళ్లు ఎలా వస్తున్నా యని నిలదీశారు. రైతులు ఎవరూ ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని.. అనంతపురం జిల్లాకు పూర్తి స్థాయిలో నీరు ఇవ్వ దంతోపాటు కింది ప్రాంతాలకు తీసుకెల్తారన్నారు. ఇంకా ఎక్కువ చెరువులకు నీరు ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశామని.. త్వరలో వాటికి కూడా నీరు ఇస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.




పొంగి పొర్లుతున్న చెక్ డ్యాంను చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి నాయకులు

# ఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీ నిధుల ద్వారా ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

## - నీటి సమస్యను పరిష్కరించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేసిన పాఠశాల సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీ నిధుల ద్వారా ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుతో అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మినారాయణ నీటి సమస్యను పరిష్కరించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపీ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ అంబిక లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దాదాపు 1,500 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు తాగునీటి సౌకర్యం అత్యవసరమని తెలుసుకున్న తర్వాత, తన ఎంపీ నిధుల ద్వారా రూ.5లక్షలు కేటాయించి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయించడం జరిగిందని తెలిపారు. మొక్క జీవితం లాగానే మనిషి జీవితమూ ఇతరులకు ఉపయోగపడేలా ఉండాలని, మొక్క నీడ, గాలి, ఆహారం అందించి చివరికి నేలలో కలిసిపోయినట్టే మనిషి కూడా తన జీవితాన్ని సమాజానికి అంకితం చేయాలని తెలిపారు. విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డిఈఓ ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు, నీరు, మౌలిక వసతులను కల్పించినందుకు ఎంపీ అంబిక లక్ష్మినారాయణని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మిదేవి, పాఠశాల హెడ్మాస్టర్ బాల కృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణస్వామి, ఆంజనేయులు, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ



పాఠశాలలోని గుడ్లను, అన్నాన్ని పరిశీలిస్తున్న ఎంపి

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త

సత్యసాయి శత జయంతి వేడుకలు నవంబర్ లో జరుగుతాయని పుట్టపర్తిలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఈనెల ఆఖరిలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులను ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. పారిశుద్ధం, వీధిలైట్లు, త్రాగునీరు, రహదారుల నిర్మాణాలను పరిశీలించారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో సుందరీకరణ పనులు పూర్తి చేయాలని, ఎక్కడ చెత్తాచెదారం లేకుండా సుందరంగా తీర్చిదిద్దాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పడమటి గేటు వైపు రహదారుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పట్టణంలో ఎక్కడ కూడా డ్రైనేజీ నీరు రాకుండా చర్యలు తీసు కోవాలన్నారు. చిత్రావతి వంతెన వద్ద 1.20 కోట్లతో జోయ్ అలుకాస్ జ్యువలరీ కంపెనీ వారి సౌజన్యంతో నిర్మిస్తున్న పార్కు నిర్మాణాలు, స్నానపు ఘాట్ లను పరిశీలించి ఈ పనులన్నీ నవంబర్ 10 లోపు పూర్తి చేయాలన్నారు. పట్టణమంతా శుభ్రంగా ఉంచాలని ఎక్కడా కూడా చెత్తాచెదారం కనిపించ కూడదన్నారు. ఈ పనులన్నీ మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ పర్యవే క్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఈ నరసింహమూర్తి, ఇంజనీర్లు సత్య నారాయణ, స్వాతి, కాంట్రాక్టర్ రాజపుత్, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, టిడిపి జిల్లా కార్య దర్శి సామకోటి ఆదినారాయణ, ఆవుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం

## - మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

యల్లనూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని మాజీ మంత్రి, వైకాపా శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. యల్లనూరు మండల కేంద్రంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేటీకరించడానికి సిద్ధం కావడం బాధాకరమన్నారు. ఈ ధోరణిని మార్చుకోకపోతే ప్రజలు రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతారన్నారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకో వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి (రాష్ట్ర సంయుక్త కార్యదర్శి) బోగాతి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి పద్మావతి, మండల కన్వీనర్ శివశంకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్ నాయకులు సుబ్బయ్య. కల్లూరు ప్రతా ప్‌రెడ్డి, కల్లూరు సూర్యనారాయణ, సేటప్ప. జాఫర్. నియోజకవర్గ వాలం టీర్ విభాగం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శైలజానాథ్



సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

# ఆర్‌వి జానకి రామయ్య అందించిన సేవలు మరువలేనివి మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త

సత్యసాయి సోదరుడు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జెరత్నాకర్ తండ్రి ఆర్‌వి జానకిరామయ్య ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ వి జానకి రామయ్య వర్ధంతి సందర్భంగా గణేష్ సర్కిల్ లో ఉన్న ఆయన సమాధి వద్ద పూల మాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, సత్యసాయి ట్రస్టు మెంబర్ గా పెనుకొండ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ప్రజలకు ఎన్నో సేవలు అందిం చారన్నారు. బాబాకు ప్రజలకు మధ్య ఆయన వారధి లా పనిచేశారన్నారు. ఆయన హయాంలో పలు గ్రామాల్లో పాఠశాలల భవన నిర్మా ణాలు, దేవాలయాలు, కళ్యాణ మండపాలు నిర్మించా రన్నారు . ఆయన హయాం లోనే సత్యసాయి పేరిట జిల్లా ఏర్పాటు చేయాలని ఆనాడే పార్లమెంటు పరిధి లోని నియోజకవర్గాలను కలుపుతూ మ్యాప్ ద్వా రా పుట్టపర్తికి వచ్చిన వి విఐపిలకు వివరిం చేవార న్నారు. ఆయన మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

# గుప్త నిధులకోసం దేవాలయ తాళాన్ని పగలగొట్టి గణపతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన దుండగులు

మొదటిపేజీ తరువాయి... ఎత్తుకెళ్లడంతో ఈ విషయం దేవాలయాలకు పోయే భక్తులు గుమిగూడి చర్చించుకోవడంతో పూజారి, గ్రామ పెద్దలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు గుడిబండ ఎస్ఐ రాజు కుళ్లాయప్ప, ఏఎస్ఐ శ్రీరాములు, పోలీసు కానిస్టేబుల్ శివన్న, మరో ఇద్దరు సంఘటన స్థలానికి చేరి, సదరు సమాచారాన్ని క్లూస్ టీంకు అందజేయగా క్లూస్ టీం సీఐ అనిల్‌కుమార్, సిబ్బంది గుప్త నిధుల కోసం గణపతి విగ్రహాన్ని దేవాలయం గర్భగుడిని తన బృందంతో పరిశీలించారు. అదే విధంగా ఆనవాళ్ల (ఎవిడెన్స్) కోసం చుట్టుపక్కల ప్రాంతాలను సైతం పరిశీలించి వేలి ముద్రలను, ఇతరాత్రలను సేకరించారు. గ్రామస్తులు ముఖ్యంగా మహిళలు తండోపతండాలుగా వచ్చి విగ్రహాన్ని ఎవరు ఎత్తుకెళ్లారని వారు నాశనం కావాలని తిట్ల దండకం మొదలు పెట్టారు. ప్రధాని కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా పోలీసులు అంతా బందోబస్తుకు వెళ్లిన విషయాన్ని గమనించి, పోలీస్‌స్టేషన్‌లో ఒక్క ఏఎస్ఐ ఉండగా గుప్తనిధుల తవ్వకం దారులు సులభంగా చడి చప్పుడు లేకుండా గణపతి విగ్రహాన్ని అంత బరువు ఉన్నదాన్ని చాక చక్యంగా తీసుకెళ్లారని, ఆ విగ్రహాన్ని ఎత్తడానికి 10 నుంచి 15 మంది గుప్త నిధుల తవ్వకం దారులు కలిసి ఈ పని చేసి ఉంటారని, పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు, సహకారంతోనే ఈ విగ్రహం చోరీ జరిగినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. శంకరేశ్వరస్వామి దేవాలయం, గణపతి విగ్రహం దాదాపు 400 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయం అని ఎత్తుకెళ్లిన గణపతి కడుపులో వజ్రాలు ఉండవచ్చన్న నమ్మకంతోనే గుప్త నిధుల తవ్వకం దారులు ఈ పనికి ఒడిగట్టి ఉంటారన్న ఒక అంచన. కనీసం ఈ పని చేయడానికి రెండు మూడు నెలలైనా రెక్కీ నిర్వహించి అదును చూసుకుని చేసి ఉండవచ్చు. స్కానర్ తెచ్చి చుట్టుపక్కల పరిశీలించి, సిసి కెమెరాలు సైతం పని చేయవని గుర్తించి చాకచక్యంగా ఎత్తుకెళ్లారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి : జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబర్ 17, ప్రభాతవార్త

స్త్రీ నిధి బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు కలెక్టర్ ఛాంబర్లో స్త్రీ నిధి బ్యాంక్ పోస్టర్లను కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలో స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు డి ఆర్ డి ఏ వెలుగులో ఉన్న స్త్రీనిధి బ్యాంకు ద్వారా 48 గంటలలో జీవనోపాధులకు రుణం అందుతున్నదన్నారు. సంఘానికి గరిష్టంగా 5 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందని, స్త్రీనిధి లో 11 శాతం తక్కువ వడ్డీతో , ఎంచుకున్న జీవనోపాధి బట్టి మహిళ కు 1 లక్ష రూపాయల వరకు రుణం సదుపాయం పొంది 12 నుండి 36 కంతులలో సులభంగా చెల్లించే వెసులుబాటు ఉంటుందన్నారు. స్త్రీనిధి సురక్ష ఋణ పథకం ద్వారా రుణం తీసుకున్న మహిళ ఆకస్మికంగా మరణిస్తే రుణం మొత్తం మాఫీ అవుతుందని, దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు , పెనాల్టీ ఛార్జీలు ఉండవన్నారు. రు ణం తీసుకున్న వారు సురక్షితంగా డిజిటల్ చెల్లిం పు, స్త్రీనిధి ఋణ రికవరీ యాప్ ద్వారా తిరిగి చెల్లించే అవకాశం కల్పించడం జరిగిం దన్నారు. ఈ ఆర్థిక సంవత్స రానికి జిల్లాలో 23411 మంది స్వయం సహా యక సభ్యులకు 234 కోట్లు అందించే ఏర్పా టు చేయడం జరిగింది అన్నారు. ఇప్పటి వరకు 9903 మంది సభ్యుల కు 89 కోట్లు మంజూరు చేసి నట్లు తెలిపారు. ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం సహాయక సంఘాల సభ్యులు జీవనోపాధులు ఏర్పాటు చేసుకొని ఆదాయం పెంపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.



స్త్రీ నిధి పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ , అధికారులు

# ఉగ్ర సంస్థలతో సంబంధం ఉంటే కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి... జడీషియల్ రిమాండ్ కోసం కు పంపడం జరుగుతుందన్నారు. భారత దేశం లో నిషేదిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పి ఎఫ్ ఐ) ఇంకా వీటి యొక్క ప్రతినిధులు ఇంకా ఇతర నిషేదిత సంస్థలతో సంబంధాలు పెట్టుకుని, సామాజిక సేవ పేరుతో ఉగ్రవాద (జిహాది) కార్యాకలాపాలను సాగిస్తున్నారని, ముస్లిం యువతను ఉగ్రవాదులుగా తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఎవరైనా ఈ రకమైన నిషేధిత సోషల్ మీడియా గ్రూప్‌లతో, పాకిస్తాన్ ఐ ఎస్ ఐ హ్యాండ్లర్స్, జిహాదీ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నట్లైతే, వారిని దేశ వ్యతిరేక/ఉగ్రవాద కార్యకలాపంగా భావించి యూఏపీ చట్టం, ఇతర సంబంధిత చట్టాల కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ విభాగం పాక్ ఆధారిత సోషల్ మీడియా గ్రూప్‌లపై గట్టి నిఘా ఉంచామని, ముఖ్యంగా ముస్లిం యువత ఈ రకమైన మత ఛాందసమైన విషయాల పై వచ్చే సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో ఏమైనా సందేహాస్పద కార్యకలా పాలు లేదా ఆన్‌లైన్ కంటెంట్ భారత దేశ వ్యతిరేక లేదా రాడికలైజ్ భావాలను ప్రోత్సహిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారమివ్వాలని అంతే గాక రాష్ట్రీయ భద్రత, ప్రజల భద్రత పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఈ సందర్భంగా జిల్లా యస్.పి. సూచించారు. ఈ కేసును ధర్మవరం ఎస్డిపిఓ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలోని రెండు బృందాలను ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్పీతో పాటు ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు, ముదిగుబ్బ సిఐ శివ రాముడు సిబ్బంది పాల్గొన్నారు.

# 400 ఏళ్ల 400 కెజీల గణపతి విగ్రహాన్ని ఎలా దొంగిలించారు..?

అగళి, అక్టోబర్ 17 ప్రభాతవార్త

అగళి శంకరేశ్వరస్వామి దేవాలయం, గణపతి దేవాలయం 400 ఏళ్ళ, చోళుల కాలం నాటి అతి పురాతన దేవాలయాలు. గతంలోనే ఐదు సార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. కానీ ఎప్పుడు విజయవంతం కాలేదు. ప్రతి సారి ఏదో ఒక సమస్య ఎ దురవ్వడం, గుప్త నిధుల తవ్వకం దారులపై కేసు నమోదైంది. చివరికి 15 ఏళ్ల క్రితం ఒక చిన్న గణపతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. ఇప్పుడు ఏకంగా 400 సంవత్సరాల నాటి 400 కెజీలు గల అందమైన రాతి గణపతిని దుండగులు, గుప్త నిధుల తవ్వకం దారులు దొంగిలించడంతో గ్రామప్రజలు విస్తుపోయారు. ఆ విగ్రహం ఎత్తుకెళ్లడానికి ఒకరిద్దరి వల్ల కాదు పదుల సంఖ్యలో కలిస్తేనే సాధ్యమవు తుంది. కర్ణాటక రాష్ట్రంలోగల ఇడుగుంజిలో పెద్ద గణపతి విగ్రహం ఉంది. అదే పోలికతో ఉన్న ఈ గణపతిపై కన్నేసి స్థానికుల సహకారం అందిం చడంతో గుప్త నిధుల తవ్వకం దారులు, గొంగలు దానిని చాకచక్యంగా ఎత్తుకెళ్లారని, ఎలాగైనా పోలీసులు ఈ విగ్రహాన్ని దొంగిలించిన వారిని పట్టుకుని న్యాయం చేయాలని గ్రామస్తులు అంటున్నారు. ప్రతిరోజు దేవాలయానికి పోయే భక్తులు ఈ రోజు గణపతి విగ్రహాన్ని దొంగలు దోచుకుపోవడంతో బాదపడుతూ వెనుతిరిగిన సందర్భాలు కనబడ్డాయి.



పరిశీలిస్తున్న క్లూస్ టీం



గుమిగూడిన గ్రామస్తులు, భక్తాదులు

# ప్రజాహితం కోసం ఉపయోగపడేలా జర్నలిస్టులు వార్తలు రాయాలి

మొదటిపేజీ తరువాయి... శిక్షణ కార్యక్రమాల్లో తొలిరోజు సీని యర్ జర్నలిస్ట్ విజయ్ కుమార్ కుర్రా కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పై తొలి ప్రసంగాన్ని చేశారు ప్రస్తుత ఆధునిక పరిస్థితులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత అన్ని రంగాల్లోనూ పెరుగుతూ పోతుందన్నారు వైద్యులు, ఇంజనీర్లు పరిశోధకులతో సహా అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధాను వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు పత్రికారంగంలో చాట్ జిపిటి, పర్ప్లెక్స్ సిటీ, గూగుల్ జెమిని వంటి యాప్ లు వినియోగించడం ద్వారా పాత్రికేయులు తమ సమయాన్ని ఆదా చేసుకోగలరు అన్నారు. కావలసిన కంటెంట్ ఇమేజ్ వీడియోలను ఈ యాప్ ల ద్వారా పొందవచ్చు అన్నారు అతి తక్కువ సమయంలో మనకు అవసరమైన కంటెంట్ తో పాటు చిత్రాలు వీడియోలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. వీటికి సరైన రీతిలో ఇన్ పుట్స్ ఇవ్వడం ద్వారా కరెక్ట్ అవుట్ పుట్ ను పొందవచ్చు అన్నారు రచనలు రాయడం, భాష మార్చడం, ఫోటోలు వీడియోలను రూపొందించడం డేటాను చూడడం వంటి పనులు చేయవచ్చునారు నోట్ ప్యాడ్ ఎల్ ఎం ద్వారా సమాచారాన్ని కావలసిన రీతిలో రూపొందించుకోవచ్చు అన్నారు ఏది అడిగినా ఇవ్వడానికి కృత్తిమ మీద సిద్ధంగా ఉందని అడగ గలిగే సామర్థ్యాన్ని పాత్రికేయులు పెంపొందించుకోవాలని ఆయన సూచించారు అయితే కృషి మా మీద ఇచ్చే సమాచారం ను మనము క్రాస్ చెక్ చేసుకోవాలని, అంతా సామాజిక శ్రేయస్సుకు కట్టుబడి ఉండేలా చూసుకోవడం ముఖ్యం అన్నారు ఆంధ్రజ్యోతి అనంతపురం ఎడిషన్ ఇంచార్జ్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం ఉద్యోగం కాదని వృత్తి అని పేర్కొన్నారు వేసే ప్రతి అడుగులో వ్యవస్థలో లోపాన్ని ఎత్తి చూపడం ద్వారా సామాజిక అభ్యుదయానికి కట్టుబడి ఉండాలని సూచించారు వార్తలకు సమాచార సేకరణ చేసేందుకు సమాజంలోని మనుషులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. వార్తలను సరైన సమ యంలో ప్రాధాన్యతా క్రమంలో పంపడం ద్వారా డెస్క్ జర్నలిస్టులకు కొంత మేర సౌలభ్యం కలిగించవచ్చు అన్నారు ప్రతి వ్యక్తి తమకు నమ్మకమైన వ్యక్తితో సమాచారం పంచుకోవడానికి ఇష్టపడతారని ఆయన తెలిపారు. వార్త సేకరణలో యాంత్రికంగా పని చేయకూడదని ప్రజలతో కలిసి పోవాలని ఆయన సూచించారు వార్త లోని అంశాలను సరైనవో కాదో ధ్రువీకరించుకోవాలని ఆయన పేర్కొన్నారు ఒక వార్తకు సంబంధించిన అంశాన్ని తరువాత ఫాలోఅప్ చేసుకోవడం కూడా నేర్చుకోవాలని సూచించారు.ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు మాట్లాడుతూ సంఘటనా స్థలాన్ని సందర్శించి రాసే వార్తలు ప్రజల మన్ననలు పొందుతాయన్నారు మండల విలేఖరులు వారానికి ఒక్క రోజైనా విధిగా రెండు గ్రామాల్ని సందర్శించి ప్రజల సాధకబాధకాలు తెలుసుకోవాలని సూచించారు టెక్నాలజీ వల్ల వార్తల్లో వేగం పెంచవచ్చని అయితే వార్తల్లో నిజానిజాలను మానవమేధ మాత్రమే గుర్తించగలరని ఆయన అన్నారు ప్రశ్నించడం అనేది విలేఖరుల హక్కుగా గుర్తించాలని అది వారి వ్యక్తిత్వంలో భాగమైపోవాలని ఆయన సూచించారు జర్నలిజంలో తగ్గిపోతున్న విలువల్ని కాపాడే ధైర్యాన్ని ప్రతి ఒక్క పాత్రికేయుడు కలిగి ఉండాలని ఆయన సూచించారు ఈ పునశ్చరణ తరగతులకు సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పయ్యావుల ప్రవీణ్, అయూబ్, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్. భోగేశ్వర్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నేతలు సనప రామకృష్ణ, కే పి కుమార్, చలపతి, చౌడప్ప, రాయదుర్గం నాయకులు కమలాక్షుడు, గురు రాఘవేం ద్ర, కె.ఎల్.ప్రసాద్, కర్నూలు జిల్లా నేతలు నాగరాజు, రాజు ఇతర ముఖ్యులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ కార్యక్ర మానికి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు..

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే హంద్రీనీవా జలాలు వృధా..!

## రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సాంకేతిక సమస్యతో మోటార్లు పనిచేయని దుస్థితి - ఛాయాపురం గ్రామంవద్ద ఎ స్కేప్ ఛానల్‌కు గండి కొట్టి నీరు వృధాగా వదిలేయడం యంత్రాంగ వైఫల్యమే - నీరు వృధా అవుతున్నా శాశ్వత పరి ష్కారం వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేయడం లేదు - వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజం

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

గత రెండు రోజులుగా అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామ సమీపాన ఉన్న హంద్రీనీవా లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద నీటిని ఎత్తిపోసే 8 మోటర్లు సాంకేతిక సమస్య వల్ల పనిచేయకపోవడంతో అధికా రులు వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామం వద్ద ఎస్కేప్ ఛానల్కు గండి కొట్టి నీటిని వృధాగా వదిలేయడాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తీవ్రం గా తప్పుపట్టారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఒక ప్రకటన విడుదల చేశా రు. ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా నీరు భారీగా వృధాగా పోతుంటే సమస్య పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం గానీ అధికార యంత్రాంగం గానీ ఇంతవరకు ఎటు వంటి చర్యలు తీసుకోకుండా ఉండటాన్ని ఆయన తప్పు పట్టారు. సాంకేతిక సమస్య తలెత్తడం తప్పదు అనుకు న్నప్పుడు చాయా పురం వద్ద ఉన్నటువంటి ఎస్కేప్ ఛానల్ కు శాశ్వత గేట్లను అమర్చి ఉంటే కాలువకు గండి కొట్టే అవసరం ఉండేది కాదు కదా అని ఆయన ప్రశ్నించారు. సాంకేతిక సమస్య తలెత్తినప్పుడల్లా కాలువలకు గండి కొడుతూ వెళుతుంటే కాలువ గట్టు భద్రతకు ముప్పు కాదా అని ఆయన అధికారులను, ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా చాయాపురం వద్ద ఉన్నటు వంటి ఎస్కేప్ ఛానల్ కు గేట్లను అమర్చి ఈ సమస్యకు శాశ్వత పరిష్కా రాన్ని చూపాల్సిన అవసరం ఉందన్నారు. గత రెండు రోజులుగా నీరు గండి కొట్టిన ప్రాంతంలోని పొలాల గుండా పారుతూ అక్కడ ఉన్నటు వంటి పంట పొలా లన్నింటిని కోతకు గురి చేస్తోందని తద్వారా రైతులు నష్టపోతున్నారని ఇప్పటికైనా అధికార యంత్రాంగం నిద్రమత్తు వదిలి వెంటనే రాగులపాడు లిఫ్టులో తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించి ఎస్కేప్ ఛానల్ వద్ద ఏర్పాటు చేసిన గండిని పూడ్చి నీటిని వృధా కాకుండా ఆపాలని, యుద్ధ ప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్ చేశారు.



ఛాయాపురం గ్రామం వద్ద హంద్రీనీవా ఎస్కేప్ ఛానల్ కు గండి కొట్టడంతో వృధాగా పోతున్న కృష్ణా జలాలు



వై.శివరామిరెడ్డి

# జాతీయ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా బాణా

తాడిపత్రి, అక్టోబరు17, ప్రభాతవార్తః రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స జాతీయ సదస్సులో తాడిపత్రికి చెందిన బాణా నాగేశ్వరరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తిరుపతిలో జరిగిన ఎంపికలో ఆయన ఏపీ తరపున హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాష్ట్ర కార్యదర్శిగా స్థానం సంపాదించి, విజయవాడలో ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు.జాతీయ స్థాయిలో హిందుస్థాన్ స్కౌడ్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన ఎన్నికలు అంతటా పూర్తి కావడంతో రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు బాణాను ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ టీమ్ సభ్యులకు బాణా నాగేశ్వరరెడ్డి తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అందించడంతో పాటు శంఖు, చక్రాలతో కూడిన శాలువాలతో వారిని ఘనంగా సత్కరించారు. రాజస్థాన్ యూనివర్సిటీ ఆడిటోరియంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జాతీయ అధ్యక్షులు శ్రీ నర్సింగ్ మెహింగ్జీ మాట్లాడుతూ తమ కార్యకలాపాలను ప్రతి పాఠశాలలోనూ, కళాశాలలోనూ విస్మృత పరచి ప్రతి విద్యార్థి, విద్యార్థినులు ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో భాగస్వాములయ్యే లా చూడాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి బాణా మాట్లాడుతూ కళాశా లల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను పరిచయం చేసిన మొదటి రాష్ట్రంగా మన రాష్ట్రం నిలిచిందని, విద్యార్థులు, యువతలో దేశభక్తి, ఉన్నత భావాలు పెంపొందించడం ద్వారా ఉన్నత పౌరులుగా తీర్చిదద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్యదర్శులు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ టీమ్ సభ్యులను సత్కరిస్తున్న ఏపీ రాష్ట్ర కార్యదర్శి బాణా